# 20. చండీశ్వర నాయనారు

చండీశ్వర నాయనారు పూర్వ నామము విచారశర్మ. చోళదేశమున తిరుచాయి జ్ఞాన నల్లూరులో యజ్ఞశర్మ, పవిత్ర దంపతులకు జనన మందినాడు. ఆ గ్రామము వేద ఘోషలకు తపస్సులకు శివభక్తిపరులకు నిలయము. విచారశర్మ కారణజన్ముడగుటచే ఐదు సంవత్సరముల ప్రాయము నిండక పూర్వమే వేద వేదాంగములయందు, ఆగమ ములందు అసమాన పండితుడైనాడు. ఏడవ సంవత్సరమున ఉపనయనము పిదప గురువు వద్దకు విద్యాభ్యాసమునకు పంపగా ఈ విషయము గురువుగారికి తెలిసినది. గురువు సంత ప్రారంభింపగా విచారశర్మ వేదములను ఏకరువు పెట్టాడు. పాఠము చెప్ప మొదలిడినంతనే శాస్త్రములనన్నింటికి చింతచేశాడు. గురువు ఆశ్చర్యచకితుడయ్యాడు. ఇంతటి శిష్యునకు తాను గురువైనందుకు ఆనంద భాష్పాలతో గురువు విచారశర్మను కౌగలించుకున్నాడు.

గురువునకు సమిధలు తెచ్చుటకు వెళ్లుచుండగా, త్రోవలో ఒక ఆలమందను పశువుల కాపరిని చూచెను. ఒక ఆవు మంద నుండి విడిపోగా పశువుల కాపరి దానిని పట్టుకొని కర్రతో చావుమోది పశువుల మందలో కలిపాడు. విచారశర్మ అదిచూచి “శివుని కారణమున గోవులు భూలోకంలో అవతరించాయి. దాని సర్వాంగములందు దేవతలున్నారు. పంచగవ్యము శివునికి అభిషేక ద్రవ్యము. గోమయము ఈశ్వర చిహ్న మగు విభూతిమూలము. ఓ అవివేకీ! నీవు ఈరోజు చాలా పాపము చేశావు. నీవు ఇక నుంచి గోవులను మేపవద్దు. నీ బదులు నే నా పనిని చేస్తాను” అన్నాడు.

యజమానుల అనుజ్ఞ పొంది గోవులను తోలుకొనిపోయి ఏపుగా పెరిగిన పచ్చిక బయళ్లలో మేపసాగాడు. నిర్మలమైన ఏటినీళ్లను వాటిచే త్రాగించాడు. చెట్లనీడలలో వాటిని విశ్రమింపచేశాడు. ఆవులు చక్కగా మేసి మనోహరముగా బలిసి నాలుగురెట్లు పాలీయసాగాయి. బ్రాహ్మణులకు సమృద్ధిగా క్షీరముండుటచే విచారశర్మ సంరక్షణకు ఆనందించారు. శివునికి క్షీరాభిషేకము చేయ మొదలిడారు.

గోవులు పాలను చాలా అధికముగా ఇచ్చుటతో, శివుని అమితంగా ప్రేమించే విచారశర్మ  శివునికి పాలాభిషేకము చేయ నిశ్చయించాడు. నది ఒడ్డున అత్తివృక్షము క్రింద కూర్చొని మట్టితో ఒక దేవాలయము నిర్మించి, అందులో మట్టితోనే శివలింగ మును ప్రతిష్ఠచేసి పాలతో అభిషేకము చేయమొదలిడాడు. అత్తిపూలతో పూజించేవాడు. విచారశర్మకు, బ్రాహ్మణులకు గోవులు సమృద్ధిగా క్షీరము నిచ్చుచున్నవి.

ఒకరోజున విచారశర్మ ఈ విధంగా పూజచేస్తుండగా, ఒక గ్రామస్తుడు ఆ దెస రావడం తటస్థించింది. విచారశర్మ గోక్షీరమును మట్టిలో పోయుట చూచాడు. విచార శర్మ పాలను మట్టిలో పోసి దుర్వినియోగము చేయుచున్నాడని అభియోగము మోపా డు. బ్రాహ్మణులు అధికారికి ఫిర్యాదు చేశారు. విచారశర్మ తండ్రిని ఏకదత్తుని బ్రాహ్మణు లు అందరు మందలించడం జరిగింది. తండ్రి యజ్ఞశర్మ (ఏకదత్తుడు) స్వయముగా త న తనయుని గురించి తెలిసికొందామని కుమారుడుండుచోటికి వెళ్లాడు. దూరము ను ంచి విచారశర్మ పాలను మట్టిలోపోయుచుండుట చూచాడు. కుమారుడు తన కడుపు నచెడబుట్టాడని - సరిగా ఏమి జరుగుచున్నది చూడక - విచారశర్మ ధ్యానములో నిమ గ్నుడైయుండగా విచారశర్మను కర్రతో మోదాడు. పాలకుండను తోశాడు. విచారశర్మ కళ్లు తెరచి తండ్రి శివాపరాధము చేశాడని ఒక కర్రను తీసికొని తన తండ్రి కాళ్లమీద కొట్టుటకు విసిరాడు. కర్రగొడ్డలయి ఆయన కాళ్లను నరికివేసింది. తండ్రి చనిపోయాడు. ఇదంతా శివలీల. విచారశర్మను పరీక్షించుటకు జరిగింది. విచారశర్మ ఏమి జరిగినది జరుగుచున్నది గమనించలేదు. మళ్లీ  ధ్యానములో నిమగ్నుడైపోయాడు.

పరమేశ్వరుడు విచారశర్మ శివదీక్షకు అమితంగా సంతోషించి పార్వతీదేవితో ప్రత్యక్షమయ్యాడు. శివుడు విచారశర్మను కౌగిలించుకొని లాలించాడు. ఆ క్షణమే విచార శర్మ శివస్వరూపుడైనాడు. శివుడు తన మెడలోని హారమును తీసి విచారశర్మ మెడలో వేశాడు. విచారశర్మకు సారూప్యముక్తి లభించింది. శివుడు చెప్పాడు. “నీవు నీ తండ్రిగారి కాళ్లను నా కొఱకు నరికావు. నేను ఈ రోజునుంచి నీకు తండ్రిని. నీకు చండీశ్వరత త్వము నిచ్చుచున్నాను. నీవు నాకు ఆహారము, పూలమాలలు, వస్త్రములు  ఇచ్చి నన్ను

అర్చించావు. ఈ రీతినే భక్తులు నిన్ను గూడ అర్చిస్తారు".

పరమశివునిపై అనితరభక్తిమూలాన్న తండ్రి హత్యాపాతకము అంటలేదు. శివుని మహాభక్తునిచే చంపబడ్డాడు కావున విచారశర్మ తండ్రికి గూడ శివసాయుజ్యమబ్బింది.